"నిజంగానేనా! ఒక్కడ పువ్వులే లేవూ?"

"కుందేళ్లు అన్నీ తెంపి కొరికి పాడిచేసేసాయి. తోటమాలి రాకుమారుడికి చెప్పాడు. 'కుందేళ్ళైనా వుండాలి, పువ్వులేనా వుండాలి' అని. రాకుమారుడు కుందేళ్ళనే వుంచమన్నాడు. అందుకే పువ్వులే లేవు." రాకుమారుని ఆజ్ఞకి సంతృప్తికలిగింది పిల్లలకి. చాలామంది మనుషులు దానికి తల్లక్రిందులు చేసేవారేమో!

"ఆ తోటలో యింకా చాలా చక్కటి వింతలున్నాయి. లక్ష్మితోటలో పచారుచేస్తోంది. సాయంత్రం అవుతోందికదూ అంచేత మంచి కుందేలేదేనా దొరుకుతుందేమో అని ఓ పెద్ద తోడేలు వచ్చింది.

"ఏరంగులో వుంది?" చాలా ఆత్రంగా వచ్చింది ప్రశ్న.

"బూడిదరంగులో వుంది. నల్లటి నాలిక—బూడిదరంగు కళ్ళు భయంకరంగా మెరుస్తున్నాయి—దాని కళ్ళయెదట పడ్డది లక్ష్మి. లక్ష్మిదాన్ని చూసింది. అది ఆమెకేసే వస్తోంది. తోటలోకి రాకుండావుంటే బాగుండుననుకుంది. ఇంక ఆలోచనకి వ్యవధిలేక పరుగు లంకించుకుంది. కాని ఆ తోడేలుకూడా పరుగెత్తింది—లక్ష్మి ఓ పొదలో దాక్కుంది. నేయింత మంచిగా వుండకపోతే యీపాటికి హాయిగా యింట్లోవుండేదాన్ని కదా" అని విచారించింది. ఆ పొదచుట్టూ తిరిగినా లక్ష్మి కనిపించలేదు. అందుకే అనవసర శ్రమ అనుకుని కుందేలుకోసం పోయింది తోడేలు. లక్ష్మి హడావిడికొద్దీ బైటకి వచ్చింది. యింతట్లో తోడేలు వెనుతిరిగి లక్ష్మిని పట్టేసుకుంది. పాపం! మిగిలిందల్లా ఆమె ధరించిన జోళ్ళూ, చిన్న చిన్న గుడ్డపేలికలూ, ఆమె మంచితనానికి సంపాదించిన ప్రైజులూను.

"ఏకుందేలైనా చచ్చిపోయిందా?"

"లేదు- అవన్నీ తప్పించుకు పారిపోయాయి"

"మొదలు బాగుండక పోయినా చివరికి చాలా బాగుంది కథ" అంది కొంచెం పెద్దపిల్ల.

"ఇంత మంచికథ ఎక్కడా వినలేదు" అన్నాడు పిల్లాడు.

"ఇవొక్కటే యింతమంచికథ:" అంది పిల్ల, మళ్ళీ.

మూలకూర్చున్న ;అత్తకి అలాతోచలేదు.

"చిన్నపిల్లకి చెప్పవలసిన కథ కానేకాదు" అంది!"సంవత్సరాలుగా నేర్పిన మంచితనం అంతా మరచి పోయారు!" అంది అత్త.

ఏదెలావున్నా తనపెట్టేబేడా సర్దుకుంటూ బ్రహ్మచారి అన్నాడు. "పదినిమిషాలు అల్లరి లేకుండా కూర్చోపెట్ట గలిగాను. మీకంటె చాలానయం కదూ!"

"పాపం!" అనుకున్నాడు రైలుపెట్టెలోంచి దిగిపోతూ బ్రహ్మచారి. "ఇంకో ఆరునెల్లదాకా యిలాంటి కథలకోసం ఆవిణ్ణి వేపుకుతింటూరు-"

---

స్కెచ్

# 'ఏంచేసినా ఒకటే'

"శ్రీవిరించి"

"ఇంటికెళ్లి యేంచెయ్యను?" అనుకున్నాడు రంగారావు. కాని యింటికి వెళ్ళకండా చెయ్యగల ప్రయోజనకరమైన పనీలేదు.

రంగారావే కాదు, సాధారణంగా మనలో చాలామందికి అడపాతడపా యిట్లాంటి ప్రశ్నే వుదయిస్తూంటుంది. అయితే దానికి తకీమని సమాధానం యేమీ దొరక్కపోయినా దగ్గరలో వున్న యే పార్కుకో వెళ్లి వొంటరిగా బెంచీ మీద కూలబడతాము. రంగారావుమాత్రం అంత కన్నా యెక్కువేం చెయ్యగలడు?

—రేడియో సంగీతం పాడుతోంది. పక్షులు కిలకిలలాడుతూ పార్కులో చెట్లమీదికి చేరుకుంటున్నాయి. ఆకాశం నిర్మలంగాలేదు, ఏ అర్థరాత్రికో పైరులు పాడుచెయ్యగల వాన రావచ్చు. మొత్తంమీద వాతావరణం ప్రోత్సాహజనకంగా లేదు. సంగీతం ఆగిపోయింది.

చేతిలో తలవాల్చుకుని వున్నవాడల్లా రంగారావు హటాత్తుగా సంగీత కెరటాలు ఆగిపోయిన వేపు చూచాడు. ఏమిటీ తమాషా! తన మనస్సు యింతసేపూ సంగీతం వింటోందా? తన దృష్ట

యావత్తూ పునఃప్రతిష్ఠమై కూర్చుంది.

తన సీనియారిటీని యెగ్గొట్టించి, ఆఫీసు కాగితాల ముక్కూముఖమూ తెలీకండా ఎల్లప్పుడూ గోళ్ళుగిల్లుకునే సిగరెట్లతో చుట్టుపక్కలవాళ్ళని తన్మయులి చేస్తో అతి షోకిల్లాగా కాలం వెళ్ళబుచ్చే జగన్నాథరావుకు యెక్కడ సెలక్షను గ్రేడు యిచ్చేసి వూరుకుంటారోనని భయం. మాటలా మరి! హోదాలోనే కాకండా ఆర్థికంగాకూడా ఎంతో ముందడుగు. ఒకవేళ అట్లాంటి దుస్సంఘట్టనే సంప్రాప్తం అయినా తను చెయ్యగలిగిందేమీలేదు, ఉస్సురని నిట్టూర్చి చేతనయినన్నాళ్లూ యేడుస్తూ వుండటం తప్ప!

చేయగలిగిందల్లా విశాలప్రపంచంలో జరుగుతున్నదంతా కళ్ళప్పగించి చూస్తూ కూచోటమే! ఏ విషయంమీదా కాని తోచిన ముక్కలు రెండు అనటానికిలేదు. "నోరా, వీపుకు దెబ్బలు తేకే" అన్న సామెతగా స్తంభించిపోవాలి. ఏమిటి మరి భావస్వాతంత్ర్యం? జీవితాల్లో యేది వుత్తమస్థానం పొందుతోంది? భావమూ, పరిస్థితులా? పార్కులో కూర్చున్నవాడు యెందుకు కూర్చున్నట్టు? అట్లా కూర్చుందామని భావం ప్రేరేపించిందా లేక పరిస్థితులు ప్రభవించినాయా?— ఏమిటి తన మనస్సు తర్కంలోకి మీమాంసలోకి దిగుతోంది? ఈ ఫిలాసఫీ అంతా ఆలోచించి బుర్ర చెడగొట్టుకోటం యెందుకు?

తనకేం కావాలి? జీవితంలో ఒకస్థానం ఆ పథంలో తుచ తప్పకండా నడుచుకొంటున్న తనకి యీ అవాంతరాలన్నీ వచ్చి యెందుకు గందరగోళ పెడుతున్నాయి? మరొకరి ప్రమేయం లేకుండా సాఫీగా నడచిపోయే జీవితమూ మరొకరికి బాధలేకుండా ప్రశాంతంగా గడచిపోయే ఘడియలూ కావాలి తనకు. ఆ వేదనలన్నీ చల్లారిపోయి ఆందోళనలన్నీ విరిగిపోయి చల్లగా చలవగా రోజులెప్పుడు అవతరిస్తాయి?

చీకటి పడిపోతోంది. ఏడుగంటలు దాటాక యింటికివెళ్తే సరళ ముఖం చిట్లించుకుంటుంది. సంసారం యేమన్నా సజావుగా నడవాలన్నా తనమూలంగా ఛిద్రాలేవీ సృష్టికాకుండా వుండాలన్నా సరళ యిష్టప్రకారం నడుచుకోవటం కన్నా మార్గంలేదు. కాని ఎందుకు సరళ కంత చిట్లింపు? ఏకటాకీని పదిగంటలకు తనక్కావ కాకుండా నిద్రపోవాలన్న దురాశ కారణం ఏమిటి? కాని "మీకేం? యిట్లాంటి శ్రీరంగనీతులు యెన్నయినా చెబుతారు. పగల్లా నిమిషం తీరిక లేకుండా యింట్లో చాకిరీ చెయ్యటం కాకుండా రాత్రిళ్లు నిద్రకూడా లేకపోతే యెలాగు? ఐనా అయిదింటికి ఆఫీసు మూసేస్తారుకదా. నేరుగా యింటికి వచ్చెయ్యకూడదండీ?" అంటుంది. ఏం తెలుసు పగల్లా తను అక్కడచేసే చాకిరీ? ఇంటి దగ్గర తను చేస్తున్నదంటే యెవరికోసం?—తనకోసం, తన సంసారంకోసం! కాని తన మాటేమిటి—తగినంత ప్రతిఫలం ఆశించకుండా యెవడికో లాభాలు సంపాయించి పెట్టటమేగా తను ఆ చీకటిగదిలో కూచుని చేసేపని. ఎవరితో చెప్పుకుంటాడు యీ సోదంతా?

"అబ్బ, మీకు రాత్రి నిద్రరాదండీ! ఆఫీసులో పగల్లా నిద్రపోతారా యేమిటి?" అనడుగుతుంది సరళ. తనమనస్సులోని ఆలోచనలూ ఆందోళనలూ యేం చెబుతాడు భార్యకు? చెప్పిమాత్రం ప్రయోజనం యేమిటి?

ఒక్కొక్కప్పుడు చెప్పరాని ఆవేశం కలుగుతుంది. తిరుగుబాటు చేదామనుకుంటాడు. కాని యెవరిమీద? ఏరీతిగా? చప్పున అణగిపోతుంది ఆవేశం తొందరపడ్డందుకు మనస్సు కదలబారుతుంది.

వికా వికలమైన మనస్సును దగ్గరికిచేర్చి మళ్ళీ ఆకారం చేకూర్చేటప్పటికి పుణ్యకాలం కాస్తా పూర్తయి పోతుంది. జీవితంలో యెన్ని పరీక్షలు! చదువుకునే రోజుల్లో చెప్పనే అక్కర్లేదు. తరవాత ఉద్యోగానికి ఒక పరీక్ష, ఉద్యోగంలో ప్రమోషన్లకు పరీక్షలు, వివాహం ఒకపరీక్ష, వైవాహిక జీవితంలో ప్రతిక్షణమూ పరీక్ష; ఇల్లాంటి పరిస్థితుల్లో ఆదుర్దాలు చంపుకోటం యెట్లాసాధ్యం?

రంగారావు తీరిగ్గా నడుస్తూ యిల్లుచేరుకునేలోపల "నేనెక్కడవున్నా ఒకటే, యేంచేసినా ఒకటే జరిగేది జరక్కమానదు!" అనుకున్నాడు. కాని నిరాశ ఆ మనస్సును జయించిందనీ, దాన్ని జయించేందుకు యెంతో ఆత్మగత విప్లవం రావాలనీ రంగారావుకు తోచదు. తోచినా అదెట్లా సాధ్యం అవుతుంది?